


శ్రీవారి హుండీ ఆదాయం రూ.112కోట్లు



ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో శనివారం నిర్వహించిన టిటిడి డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడారు. ఫిబ్రవరి నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, విక్రయించిన శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదం, కల్యాణకట్ట, హుండీ ఆదాయం తదితర వివరాలను తెలిపారు. ఫిబ్రవరి నెలలో 10.06 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, 95.43లక్షల లడ్డూలను విక్రయించినట్లు తెలిపారు. అలాగే 43.61లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని, 6.56 లక్షల మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించినట్లు వివరించారు. కాగా ఫిబ్రవరి నెలలో తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.111.71కోట్లు వచ్చినట్లు తెలిపారు.

నేడు పల్స్ పోలియో కార్యక్రమం



పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ అముద

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజంను నిర్మిద్దామని చిత్తూరు నగర మేయర్ అముద పేర్కొన్నారు. శనివారం జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి గాంధీ సర్కిల్ వరకు జరిగే పల్స్ పోలియో ర్యాలీని నగర మేయర్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 0-5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు. పిల్లలు భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండడానికి ఈ వ్యాక్సినేషన్ తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పోలియో రహిత సమాజంను ఏర్పాటు చేయడంలో తోడ్పడాలన్నారు. డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ ఈనెల 3వ తేది ఆదివారం పల్స్ పోలియో కేంద్రాలలో పల్స్‌పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయించలేని వారి పిల్లలకు 4, 5 తేదీలలో ఇళ్ల వద్దకు వెళ్ళి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ లోకేష్, డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్, శ్రీనివాసులు, జార్జ్, గుణశేఖర్, జయరాముడు, రవి, ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, పదవివీరమణ పొందడం అభినందనీయమని, ఇన్ని రోజులు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారని, మనమంతా ఒకే పోలీసు కుటుంబమని జిల్లా ఎస్పీ జాషువ అన్నారు. శనివారం పోలీస్‌శాఖలో ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలు పాటు అంకిత భావంతో అందించిన సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసు డిపార్టుమెంటులో పనిచేయడం సవాలతో కూడుకొన్నదని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరపున కతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దష్టి సారించాలని సూచించారు. అనంతరం స్థానిక పోలీసు పోలీస్ గెస్ట్‌హౌస్ కాన్ఫరెన్స్ హాలులో ఫిబ్రవరి నెలలో పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులను ఎస్పీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

30 పోలీస్ యాక్ట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సార్వత్రిక ఎన్నికలు పూర్తి అయ్యేవరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌కు సంబంధపడిన నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని చిత్తూరు డీఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు నిర్వహించకూడదని అన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న 14 పోలీస్ స్టేషన్లు అనగా చిత్తూరు 1వ పట్టణ పోలీసు స్టేషను, 2వ పట్టణ పోలీసు స్టేషను, చిత్తూరు తాలుకా జిడి. నెల్లూరు, ఎన్ఆర్ పేట, పెనుమూరు, యాదమరి, గుడిపాల, తవణంపల్లి, కాణిపాకం, పూతలపట్టు, ఐరాలా, కల్లూరు, రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు జరపకూడదన్నారు, అలా జరపాలనుకున్న నేపథ్యంలో ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న నిర్ణయం కావున అందరూ సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.



మహాబలిపురం బీచ్‌లో
ముగ్గురు పలమనేరు విద్యార్థులు గల్లంతు



మృతులు ప్రభు (19) సదుం, మౌనిష్ (19), విజయ్ (19) బంగారుపాళ్యం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, పలమనేరు తమిళనాడు రాష్ట్రం మహాబలిపురం బీచ్‌లో చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. వీరు ముగ్గురు పలమనేరు ఎస్‌విసిఆర్ డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులుగా పోలీసులు గుర్తించారు. శుక్రవారం కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడంతో సెలవుదినంగా ప్రకటించారు. జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు జాబ్‌మేళా ముగిసిన వెంటనే తమిళనాడులోని మహాబలిపురం విహారయాత్రకు 18 మంది విద్యార్థులు బందంగా వెళ్లారు. శనివారం ఉదయం మహాబలిపురం సముద్రపు బీచ్‌లో సరదాగా ఈత కోసం సముద్రంలోకి దిగారు. అలల ఉధృతికి కొట్టుకుపోయి బంగారుపాళ్యం మండలంకు చెందిన మౌనిష్ (19), విజయ్(19)తోపాటు సదుం మండలం రెడ్డివారిపల్లి గ్రామంకు చెందిన ప్రభు (19)అనే విద్యార్థులు గల్లంతయ్యారు. గల్లంతైన విద్యార్థులను వెలికి తీసే పనిలో గజ ఈతగాళ్లునిమగ్నమయ్యారు. గల్లంతైన వారిలో విజయ్ మతదేహం లభ్యమైనట్లు సమాచారం. విహారయాత్రకు వెళ్లిన వారిలో 11మంది విద్యార్థులు, 8 మంది విద్యార్థినులు ఉన్నట్లు తెలుస్తోంది.

మృతులల్లో ఒకరైన ప్రభు(19) చిత్తూరు జిల్లా సదుం మండలం రెడ్డివారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెదకంటి వారిపల్లికి చెందిన శివరాణి కొడుకుగా గుర్తించారు. ప్రభు తండ్రి మరణించడంతో ప్రభు తన తాతయ్య, అమ్మమ్మలు సిద్ధయ్య, కృష్ణమ్మల వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. గతంలో భర్త ఇప్పుడు బిడ్డ చనిపోవడంతో శివరాణి, ఆమె కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తోడుగా ఉంటాడనుకున్న కొడుకు చనిపోయాడని గ్రామస్తులు కన్నీంటిపర్యంతమయ్యారు. అలాగే బంగారుపాళ్యం మండలం నల్లగంపల్లి పంచాయతీ కెసి కండ్రికకు చెందిన చంద్రబాబు కుమారుడు మోనిష్ (19), తులసి కుమారుడు విజయ్(19). ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



త్రిముఖ పోటీ...
అధికార ప్రతిపక్షానికి ధీటుగా కాంగ్రెస్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 12వ తేదీ విడుదల కానున్న నేపథ్యంలో జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు ధీటుగా కాంగ్రెస్ వామపక్షాల కూటమి కూడా ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలో దింపుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు ధీటుగా కాంగ్రెస్ జిల్లాలో ఏమాత్రం తగ్గేదేలే...దంటూ మందుకు దూసుకుపోయిందుకు కాంగ్రెస్ శ్రేణులను సమాయత్వం చేస్తోంది.

ప్రజాదృష్టి

తిరుపతి కాంగ్రెస్ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శేణుల్లో నూతన ఉత్సహం నెలకొంది. ప్రభుత్వ యంతాగ్రం, పోలీసులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా తిరుపతిలో నిర్వహించిన కాంగ్రెస్ సభ విజయవంతం కావడం కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభం వచ్చే సూచనలున్నాయడానికి నిదర్శనం. తిరుపతి సభలో తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం వైఫల్యాలపై విరుచుకుపడ్డారు. కేంద్రంలోని బిజెపితో సన్నాయి నొక్కులు నొక్కుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ తీసుకురావడంతో దొందూ..దొందు అన్నట్లు జగన్ మోహ్మన్‌రెడ్డి, చంద్రబాబు నాయడు వ్యవహరిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాల కూటమిని ఆదరించాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం కేంద్రంలోని బిజెపిని ఓడించేందుకు ఇండియా కూటమి బలం పెరుగుతోందని, రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బిజేపి, రాష్ట్రంలో వైసిపి గల్లంతు కావడం ఖాయమని ఘాటైన వ్యాఖలతో రాజకీయ ప్రచారాన్ని ప్రారంభించారు.

అధికార వైసిపి, పతిపక్ష తెలుగుదేశానికి ఏమాత్రం తీసిపోని విధంగా కాంగ్రెస్, వామపక్షాల కూటమి ధీటైన అభ్యర్థులను ఎన్నికల బరిలో దింపుతోంది. కాంగ్రెస్‌ను నుండీ పోటీ చేసేందుకు చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో ఒక్కొ నియోజకవర్గం నుండీ ఏడుగురు అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. దేశంలో లౌకికత్వం కాపాడుకోవడం కోసం కాంగ్రెస్, వామపక్షాలు ఎన్నికల్లో సంయుక్తంగా పోటీ చేస్తున్నాయి. వైఎస్ షర్మిల తిరుపతి సభ తరువాత అధికార, ప్రతిపక్ష పార్టీల నుండీ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు ప్రాంరభమయ్యాయి.

పకడ్బందీగా ఎంఎస్ఎంఈ సర్వే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం విజయవాడ సిఎస్ కార్యాలయం నుంచి రెవెన్యూ, రీసర్వే 3వ దశ ఇనామ్, అసైన్డ్ భూములు, ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్, హౌసింగ్, పిఆర్ అండ్ ఆర్‌డి, ఎన్ఆర్ఇజిఎస్, కరువు మండలాలలో వేజ్ జనరేషన్, కరువు మండలాల్లో తాగునీటి ఎద్దడి, పరిశ్రమలశాఖ, ఎంఎస్ఎంఈ క్లస్టర్లకు భూమి కేటాయింపు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో, ఇమ్యూనైజేషన్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు జిల్లా నుండి కలెక్టర్ ఎస్.షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ... మూడవ దశ రీసర్వేకి సంబంధించి 74గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ హౌస్‌సైట్‌లకు సంబంధించి 20,213 రిజిస్ట్రేషన్‌లు పూర్తిచేయడం జరిగిందని, ఈ ప్రక్రియని వేగవంతం చేయాలన్నారు. ఎన్ఆర్ఈజిఎస్‌కు సంబంధించి 82,483 పనులు ప్రారంభించగా 40,392 పనులు జరుగుతున్నాయని, 42,091 పనులు పూర్తి అయ్యాయని, ఇందులో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వై.యస్.ఆర్ హెల్త్ క్లినిక్ లు, బిఎంసియులు, డిజిటల్ లైబ్రరీలు, పురోగతిలో ఉన్న భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను వంద శాతం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని, ఈకేవైసి ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని, ఇప్పటివరకు 3,15,807 కార్డులు పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణపై కార్మికులకు శిక్షణ



వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని వివరిస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సరైన శిక్షణ పొందడం ద్వారా ఘనవ్యర్థాల నిర్వహణను పక్కాగా, సులభంగా చేయవచ్చని ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ చెప్పారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు.. పారిశుధ్య కార్మికులకు ఘనవ్యర్థాల నిర్వహణ (తడి, పొడి వ్యర్థాల)పై శనివారం నగరపాలక కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నగరపాలక ప్రజారోగ్య అధికారి మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనల ప్రకారం ఘనవ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలోనే వ్యర్థాలను పూర్తిస్థాయిలో సెగ్రిగేషన్ చేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణను సులభంగా చేపట్టవచ్చని వివరించారు. ఘణవ్యర్థాల నిర్వహణపై రిసోర్స్ పర్సన్ మస్తానయ్య పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. వ్యర్థాలు ఎలా ఉత్పత్తి అవుతాయి? వ్యర్థాలు ఎన్ని రకాలు, వాటిని ఎందుకు వేరు చేయాలి, గహ స్థాయిలోనే ఎందుకు వేరు చేయాలి? వివిధ రకాల వ్యర్థాలను వేర్వేరుగా ఎలా సేకరించాలి. తరలింపు, ప్రాసెసింగ్ అంశాలపై క్షుణ్ణంగా దశ్యమాధ్యమాల ద్వారా అవగాహన కల్పించారు. వ్యర్థాలను వేరు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలు, వేరు చేయకపోవడం వల్ల కలిగే నష్టాలు, అనర్థాలను సవివరంగా వివరించారు. అనంతరం వ్యర్థాల రకాలు, వాటిని వేరు చేయడంపై ప్రత్యక్షంగా చూపించి కార్మికులతో చేయించారు. ఈకార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులు, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

మళ్లీ ధర పెరిగిన ఉల్లి

- కూరగాయల ధరలకు రెక్కలు
- రోజురోజుకి పైపైకీ...
- పెళ్లిళ్లు, ఫంక్షన్ల పై ప్రభావం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఉల్లిపాయల ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. నిన్నమొన్నటి వరకూ ఉల్లి ధరలు కాస్త తగ్గినట్టు కనిపించినా.. అది ఎంతోకాలం నిలవలేదు. మహారాష్ట్ర నుంచి కొత్త ఉల్లిపాయలు ఒకేసారి మార్కెట్లను ముంచెత్తడం, వివిధ రకాల నాణ్యతలు కలిగిన ఉల్లిపాయలు అందుబాటులోకి రావడంతో సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు తమకు నచ్చిన క్వాలిటీని ఎంపిక చేసుకునేవారు. ఆటోల్లో ఇళ్ల దగ్గరకు తెచ్చి మరీ ఏడు కిలోలు రూ.100కు కూడా విక్రయించారు. ఇక రైతు బజార్లు, బహిరంగ చిల్లర మార్కెట్లలోనూ ధర కాస్త తక్కువగానే ఉండేది. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై తాత్కాలికంగా నిషేధం ఎత్తివేయడంతో మహారాష్ట్ర నుంచి ఇతర దేశాలకు భారీగా ఎగుమతులు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లోకి ఉల్లిలోడులు తక్కువగా వస్తున్నాయని, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో కొరత ఏర్పడి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోందని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. మరోపక్క కూరగాయల ధరల్లోనూ పెరుగుతూనే ఉన్నాయి. మాఘమాసంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెద్దసంఖ్యలో జరుగుతుండడంతో కూరగాయల వినియోగం భారీగా పెరిగింది. దీంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. అలాగే ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పుల ప్రభావం కూరగాయల దిగుబడులపై పడుతోంది. దీంతో కూరగాయల ధరల్లో కొంత పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా గతవారం రోజులుగా ధరల్లో పెరుగుదల కనిపిస్తోంది.

హోల్ సేల్ మార్కెట్లో మంచి నాణ్యత కల్గిన ఉల్లిపాయలు కిలో రూ.26 నుంచి రూ.28 ధర ఉంది. ఇదే రకాన్ని బహిరంగ మార్కెట్లో రిటైల్ వ్యాపారులు రూ.30 నుంచి రూ.35ల వరకూ విక్రయిస్తున్నారు. రైతు బజార్లలో మొన్నటివరకూ కిలో రూ.20లు ఉండగా ఇప్పుడు రూ.24లకు చేరింది. ఆటోల్లో ఇళ్ల దగ్గరకే తెచ్చి విక్రయించేవారు కూడా (చిన్న ఉల్లిపాయలు) రూ.100లకు ఐదు కిలోలు మించి ఇవ్వడం లేదు. క్వాలిటీ తక్కువగా ఉండే రకాలు మార్కెట్లోకి రాకపోవడం, మంచి రకాలు, నిల్వలు ఎక్కువ రేటులో ఉండడంతో వీధుల్లో విక్రయించే చిల్లర వ్యాపారులు ఉల్లిపాయల జోలికి వెళ్లడం లేదు.

కూరగాయలదీ అదే దారి...

ఉల్లిపాయల బాటలోనే కూరగాయల ధరల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఒక్క టమోటా మినహా మిగిలిన అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. బహిరంగ చిల్లర మార్కెట్లో వంకాయలు కిలో రూ.80 వరకూ అమ్ముతున్నారు. బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయలు రూ.50, బీరకాయలు రూ.40, చిక్కుళ్లు రూ.80 వరకూ అమ్ముతున్నారు. రైతుబజార్లలో ధరలు పరిశీలిస్తే వంకాయలు కిలో రూ.54, గులాబీ రకం రూ.44, తెలుపు రూ.38 ఉంది. రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకూ ధరలు పెరిగాయి. కాలీఫ్లవర్ రూ.25లకు విక్రయిస్తున్నారు. ఇది రూ.12 నుంచి 15లకు దొరికేది. బెండకాయలు రూ.32, పచ్చిమిర్చి రూ.34, కాకరకాయలు రూ.38, చిక్కుళ్లు రూ.54, చేమదుంపలు రూ.50, బీన్స్ రూ.60, సొరకాయ రూ.16.. ఇలా అన్ని రకాల కూరగాయల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. రైతుబజార్లతో పోల్చితే బహిరంగ మార్కెట్లలో ధరలు మరింత ఎక్కువగానే ఉంటాయి.



ధరలు మరింత పెరిగే అవకాశం...

తిరుపతి ఇంద్రిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు తమిళనాడు, కర్ణాటక, కర్నూలు, ఒంగోలు నుంచి కూరగాయల లారీలు రోజుకి 30పైగా వస్తాయి. రాబోయే రోజుల్లో ఉల్లిపాయలు, కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర దేశాలకు ఉల్లి ఎగుమతులపై మళ్లీ నిషేధం విధించినా ఉల్లిపాయల ధరలు ఇప్పట్లో తగ్గకపోవచ్చనే అంచనా వేస్తున్నారు. ఉల్లిపాయలు పాతబడితే వాటి నాణ్యత పెరుగుతుంది. నిల్వకు ఆగుతాయి. ఇలాంటి రకాలన్నీ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తారు. మంచి రేటు వచ్చాక బయటకు తీస్తారు. ఎగుమతులపై నిషేధం లేకపోతే క్వాలిటీ ఉల్లిపాయలను మంచిరేటుకు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారని, దేశీయ మార్కెట్లో కొరత ఏర్పడి ధరలు పెరుగుతాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. అలాగే, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే ఆ ప్రభావం కూరగాయల సాగుపై పడుతుంది. దిగుబడులు లేకపోతే ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకురావాల్సి ఉంటుంది. ఫలితంగా ధరలు మరింత పెరుగుతాయని కూరగాయల వ్యాపారులు అంటున్నారు. అటు ఉల్లిపాయలు ఇటు కూరగాయలు పెరుగుదల సామాన్యులపై ప్రభావం పడనుంది.

శివరాత్రి ఉత్సవాలకు వేళాయే..
నేటి నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఈనెల 3వ తేదీ ఆదివారం నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానునున్నాయి. 3న భక్తకన్నప్ప ధ్వజారోహణం, 4న శ్రీకాళహస్తీశ్వరస్వామి ధ్వజారోహణం, 5న 2వ తిరునాళ్లు, 6న మూడవ తిరునాళ్లు, 7న నాలుగవ తిరునాళ్లు, 8న మహాశివరాత్రి, 9న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 10న ఆదిదంపతుల కల్యాణం, 11న సభాపతి కల్యాణం, 12న కైలాసగిరి ప్రదక్షిణ, 13న ధ్వజావరోహణం, 14న పల్లకీసేవ, 15న ఏకాంతసేవ, 16న శాంతి అభిషేకం నిర్వహించనున్నారు. ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండటానికి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇప్పటికే తిరుపతి కలెక్టరు డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం రాజగోపురం వెనుక వైపున కళాప్రాంగణం సిద్ధమైంది. స్వామి అమ్మవార్ల సేవలకు ఆలయ అధికారులు వాహనాలు సిద్ధం చేశారు.

ప్రధాన అర్చకులకు బంగారు ఆభరణాలు అప్పగింత

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి అలంకరించడానికి అవసరమైన బంగారు ఆభరణాలను శనివారం ఆలయ ప్రధాన అర్చకులకు అప్పగించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ బ్యాంకులోని లాకర్లలో ఉంచిన ఆ బంగారు ఆభరణాలను అధికారులు పరిశీలించి ప్రధాన అర్చకులకు అందజేశారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు ఈ ఆభరణాలను స్వామిఅమ్మవార్లకు అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్వీ నాగేశ్వరావు, సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, పర్యవేక్షకులు కళ్యాణి, అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ రవిచంద్ర, అలంకార గురుకుల్ రాజేష్, సూరి పాల్గొన్నారు.

అడ్మిషన్లు పెంచండి

ప్రజాశక్తి-సదుం: మండల కేంద్రంలోని ఎంపియూపీ ఉర్దూ పాఠశాల అడ్మిషన్స్ పెంచేందుకు పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు ఆ దిశగా కృషి చేయాలని ఏపీ మైనారిటీ వింగ్ ఏఎంవో అబ్దుల్ గని అన్నారు. శనివారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఐఈ కో ఆర్డినేటర్ ప్రభాకర్ వర్మ, ఎస్ఎంసీ మునాఫ్, పాఠశాల ఛైర్మన్ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు పీవోపీ ద్వారా ఆటో

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మండలంలోని దామరపాకం దళితవాడలోని ఇందిరమ్మ ఎస్‌హెచ్‌జీ గ్రూపుకు చెందిన మౌనిక అనే మహిళకు సెర్ప్ విభాగం ద్వారా పీవోపీ (పూర్ ఆఫ్ పూర్) పథకంలో ఆటోను అందించారు. శనివారం మహిళకు ఆటోను మంత్రి ఆర్కేరోజా ఆటోను లబ్దిదారులకు అందించారు. సెర్ప్ అధికారులు మాట్లాడుతూ పీవోపీ పథకంలో రూ.301472 వడ్డీలేని రుణం అందించడం జరిగిందన్నారు.

'శిక్షణకు హాజరుకండి'

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: చిత్తూరు జెడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించబోయే ఈవీఎం యంత్రాల శిక్షణ కార్యక్రమానికి హాజరవ్వాలని అధికారులకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటశివ పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మట్లాడుతూ సోమవారం ఉదయం చిత్తూరు జెడ్పీ హాల్‌లో శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వ హణ కార్యదర్శి ధనంజయనాయుడు, మండల టిడిపి కో ఆర్డినేటర్ శివప్రసాద్‌లు అన్నారు. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వరత్తూరు పంచాయతీ కాలేపల్లిలో కొత్త ఓటర్లను పలువురిని కలిసి టీడీపీకే ఎందుకు ఓటేయాలని శనివారం రాత్రి వివరించారు. తులసిరెడ్డి, సోమశేఖర్ నాయుడు, నరసింహులు, ఉమాపతి, రఘు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

ప్రజాశక్తి-కార్వేటినగరం: బ్యాంకులో జరిగే ఆర్థిక లావాదేవీలు, నగదు డిపాజిట్, ఋణాలు వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రోహిత్ పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఫైనాన్సియల్ లిటరసీ వారోత్సవాలలో భాగంగా చిత్తూరు జిల్లా లీడ్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరిష్ ఆధ్వర్యంలో ఆర్థిక వనరులపై అవగాహన కల్పించే క్విజ్ పోటీలను నిర్వహించారు. శనివారం ఉత్తమ ప్రతిభ కనబరిచినా వారికి బ్యాంక్ మేనేజర్ రోహిత్ చేతుల మీదుగా వరుసగా బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు అన్ని వర్గాలకు, అన్ని రంగాల వారికి ఉపయోగపడే వనరుగా అభివృద్ధి చెందుతున్నదని, నగదు రహిత లావాదేవీలు సైతం బ్యాంకు నుంచే జరుగుతోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలసుబ్రమణ్యం ఆచారి, సుబ్బారావు, హరిబాబు, కార్తిక్, జోగి ప్రసాద్, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం ద్వితీయ సంవత్సరం తొలి పరీక్ష ప్రాశాంతంగా జరిగింది. 117మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 111మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపల్ గంగాధరనాయుడు తెలిపారు. 6మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

8న కళామందిర్‌లో మహిళా సదస్సు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని సాయినగర్‌లోని కళామందిర్‌లో తెలుగు సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో 8న మహిళా దినోత్సవ సందర్భంగా జరిగే మహిళా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంస్థ అధ్యక్షుడు తులసినారనాయుడు తెలిపారు. కార్యక్రమం జాయినింగ్ ద డాట్ ఫౌండేషన్ వారితో కలసి నిర్వహిస్తున్నామని ఇందులో మహిళలు ఆర్థిక స్థలంబన అన్న అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని, వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్‌లో వివిధ పోస్టులకు నియామకాలకు నూతనంగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఆర్.విజయ శంకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోస్టులకు ఎనిమిదో తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్ విద్యార్హతతో 21 సంవత్సరాలు వయసు గలిగిన అభ్యర్థుల నుండి అగ్ని వీర్ టెక్నికల్, జనరల్ డ్యూటీ, నాన్ టెక్నికల్, స్టోర్ కీపర్, ట్రేడ్స్ మాన్ పోస్టుల నియమకానికి మార్చి 22, 2024 వరకు అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఈ రిక్రూట్మెంట్‌కి సంబంధించి సందేహాల నివత్తికి హెల్ప్ లైన్ డస్ట్ నెంబర్ 0863 - 2230008 సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

బ్యాంకు సేవలపై కళాబృందం ప్రచారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారతీయ స్టేట్ బ్యాంకు నాబార్డు వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం కేజీ సత్రం బ్రాంచ్ బ్యాంకులలో ఉన్న స్కీములు, లోనులను గురించి గుండ్లకట్టమంచి, సంక్రాంతిపల్లి గ్రామస్తులకు ఎంవి.రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం పి.శివకుమార్ పాటల ద్వారా తెలియచేశారు. బ్యాంక్ మేనేజర్ రవి నాయక్, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు యువత పాత్ర కీలకం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన సీఎం జగన్మోహన్ రెడ్డి వైపే రాష్ట్ర ప్రజానీకం ఉన్నారని చిత్తూరు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయనందరెడ్డి అన్నారు. శనివారం మురకంబట్టులోని ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్ యువజన విభాగం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యువకుల నుండి అపూర్వ స్పందన వచ్చింది. విజయానంద రెడ్డి మాట్లాడుతూ పార్టీలో యువత పాత్ర చాలా కీలకం అని యువతకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని అన్నారు.

ఆడబిడ్డకు న్యాయం చేయలేని జగన్.. రాష్ట్రానికి ఏం చేస్తాడు..: మాజీ మంత్రి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

ప్రజాశక్తి-పలమనేరు: ఆడబిడ్డకు న్యాయం చేయలేని సీఎం జగన్ రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలకు ఇంకేం న్యాయం చేయగలడని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం పలమనేరు పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వివేక హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలని, రాజకీయ లబ్ధి కోసమే వైఎస్ వివేకానందరెడ్డిని హతమార్చడం జరిగిందనే విషయం జగమెరిగిన సత్యం అన్నారు. సిబిఐ విచారణ పిటిషన్ వేస్తానని వైఎస్ సునీత అంటే జగన్ ఎందుకు ఆపారో ఆయన సమాధానం చెప్పాలన్నారు. తన సోదరి వైఎస్ సునీత రెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు ఇప్పటికైనా జగన్ అండ్ కో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా వైసీపీ శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని, విలువలు, విశ్వసనీయత, మాట తప్పను మడమ తిప్పను లాంటి డైలాగులు చెప్పడం ఇకనైనా వైసీపీ నాయకులు మానుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉండాలంటే కచ్చితంగా ఇలాంటి సంఘటనలను అందరూ ఖండించాలని వైఎస్ సునీత తెలిపినట్లు జగన్‌ను ఓడించడంతో పాటు ఆమె చేస్తున్న న్యాయ పోరాటానికి అందరూ మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

మూడు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మూడు దశాబ్దాల సమస్యకు మంత్రి ఆర్‌కే రోజా పరిష్కారం చూపారు. శనివారం మండలంలోని దామరపాకం గ్రామంలో సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని, గడపగడపకు నిధులు రూ.10.80 లక్షల నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డును, మండల నిధులు రూ.4.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.9.52 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ పథకంలో చెర్లో కండ్రిగ నుండి టీవీ కండ్రిగ, దామపాకం, దామపాకం ఎస్టీకాలనీ, దామరపాకం దళితవాడలకు పైప్‌లైన్ ద్వారా సరఫరాచేసే మంచినీటి పథకాన్ని ఆమె ప్రారంభించారు. మూడు దశాబ్దాల తాగునీటి సమస్యను పరిష్కరించారంటూ స్థానిక మహిళలు ఆమెకు పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, ఎంపీటీసీ జ్యోతి, మండల పార్టీ అధ్యక్షులు సుదర్శననాయుడు, నాయకులు హరిరెడ్డి, గణపతిశెట్టి, సునీల్ రెడ్డి, విజయ్‌రెడ్డి, ధనశేఖర్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అభిమానులను వేధించొద్దు...

పోలీసులకు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు వినతి



ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్ : ఎన్నికల సమయంలో బైండవర్ పేరిట తన అభిమానులను వేధించవద్దని చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పోలీసులను కోరారు. ఆదివారం కట్టమంచిలోని తన నివాసంలో తన అభిమానులతో సీకే బాబు నిర్వహించనున్న ఆత్మీయ సమావేశ వేదిక, సమయం, తదితర విషయాలను ఫోన్ ద్వారా తెలియజేస్తున్న సీకే బాబు అభిమానులు జయకుమార్, నారాయణరెడ్డి, షేరు, సూరి, సురేష్, శేఖర్‌లను స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు బైండవర్ పేరిట అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు టు టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అభిమానులు రౌడీలు, గుండాలు కారని మంచివారన్నారు. వారిని వేధిస్తే తాను సహించబోనన్నారు. టూ టౌన్ పోలీసులు మాట్లాడుతూ... ఎన్నికల ప్రక్రియలో భాగంగానే పలువురు వ్యక్తులను బైండోవర్ చేసుకొని వదిలిపెట్టామని, అంతేగాని తమకు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ఇదిలా ఉండగా సికే బాబు చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు రాగానే దర్గా సర్కిల్, పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

తొలగించిన క్షురకులను విధుల్లోకి తీసుకోవాలి

కందారపు మురళికి యానాదయ్య క్షమాపణ చెప్పాలి: రాధాదేవి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల కళ్యాణకట్టలో తొమ్మిది మంది క్షురకులను వేంటనే విధుల్లోకి తీసుకోవాలని, అలా విధుల్లోకి తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తలనీలాల కేంద్రాల్లో కత్తి డౌన్ పాటించేలా ఉద్యమిస్తామని మహిళా క్షురకుల సంఘం వ్యవస్థాకురాలు రాధాదేవి స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి నేతృత్వంలోని బోర్డు నిర్ణయం తీసుకుంటే ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. హామీని అమలు పరచాల్సిన భాధ్యత టిటిడి ఈవోపై ఉందని, వెంటనే అధికారులు స్పందించి తొలగించిన శ్రీహరి, ప్రసాద్‌తో సహా మిగిలిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. టిటిడిలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలను పీస్‌రేట్ క్షురకులకు వర్తింప చేయాలన్నారు. రానున్న 10 తేదిలోపు తొలగించిన వారిని తిరిగి విదుల్లోకి తీసుకోక పోతే 13వ తేదీ రాష్ట్రంలో ఉన్న అన్ని నాయీబ్రాహ్మణ కులసంఘాల మద్దతుతో, రాజకీయ పార్టీల మద్దతుతో పెద్ద ఎత్తున టిటిడి పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తామన్నారు. నిరంతరం నిరుపేదల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసి, కార్మికులకు అండగా ఉన్న సిఐటియు నాయకులు కందారపు మురళీ, టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పిల్లలు మాదకద్రవ్య అలవాటు, మాదక ద్రవ్య అక్రమ రవాణా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్సీ రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక గేటు పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని, విలువైన జీవితాలు ఛిద్రమవుతున్నాయన్నారు. వీటి వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చి అనారోగ్యం పాలు కాకుండా పిల్లలు ఇంట్లోనే ఉండి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. హోటల్లో ఫాస్ట్ ఫుడ్లను అనారోగ్యకరమైన టేస్ట్ సాల్ట్ ఉపయోగించడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, కల్తీ ఆహారాన్ని నిరోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలసుబ్ర మణ్యం, ఎస్ఐ వెంకట మోహన్, పాఠశాల ఉపాధ్యాయులు వేములు, పీటి మాస్టర్ జయదేవ్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ఆ స్థలం ఖాళీ చేయండి..

- లేకుంటే కేసులు తప్పవు..
- కోట దళితవాడ గ్రామస్తులకు ఆర్‌డీవో హెచ్చరిక



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం డిగ్రీ కళాశాల ఆవరణంలో నివాసాలు ఉంటున్న వారు వెంటనే ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని ఆర్‌డీవో వెంకటరమణారెడ్డి కోట దళితవాడ గ్రామస్తులను హెచ్చరించారు. కాదంటే బలవంతంగా అక్కడి నుంచి ఖాళీ చేయించాల్సి ఉంటుందన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సుమారు 20ఏళ్ల క్రితం ఆ స్థలాన్ని ప్రభుత్వం విద్యాశాఖకు అప్పగించిందన్నారు. అందులో కళాశాల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కాగా కళాశాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రహరీనిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కళాశాలకు కేటాయించిన స్థలంలో కొంతమంది గుడిసెలు వేశారు. అయితే ప్రహరీ నిర్మాణానికి ఇబ్బంది ఏర్పడిందన్నారు. అనంతరం ఆయన గ్రామస్తులతో సానుకూలంగా మాట్లాడుతూ ప్రస్తుతం అక్కడ వేసిన గెడిసెలను తొలగించి సహరించాలన్నారు. మరో చోట స్థలం చూపించి ఇళ్ల మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అలా కాదని వ్యవహరిస్తే కేసు నమోదు చేసి బలవంతంగా ఖాళీ చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, తహశీల్దార్ పుష్పకుమారి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి, ఆధ్యాపకులు కోటదళివాడ గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థులకు వీడ్కోలు..



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, నాయకులు పూలా శంకర్ రెడ్డి, క్రిష్ణప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు గౌరవించి సమాజా దేశ అభివృద్ధికి కృషి చేసే విధంగా విద్యార్థులు ఆలోచన విధానం ఉండాలని అన్నారు. విద్యార్థులు దేశం పట్ల మక్కువతో పోలీసు,మిలటరీ ఉద్యోగాలలో విధులు నిర్వహిస్తుండడం, దేశభద్రత కోసం వారు చూపించిన తెగువ ఎవరూ మరచిపోలేరని అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జీతాలు మంజూరు చేయండి: కృష్ణమూర్తి



కృష్ణమూర్తి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సమగ్ర శిక్ష వారికి జీతాలు మంజూరు చేయాలని జిల్లా సీఆర్‌పీల సంఘ అధ్యక్షులు కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సమగ్రలో పనిచేస్తున్న సీఆర్‌పీఎస్, ఐఈఆర్‌టి, పీటీఐ, డిపీవో సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని వెంటనే జీతాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరారు. సీఆర్‌పీ జిల్లా కన్వీనర్ విల్వనాద్, సతీష్‌బాబు, శరత్‌బాబు, లత, నంద, యమున తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ గుట్టకింద ఇరులపల్లె గ్రామంలో అధికారులు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. శనివారం ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మణికుమార్ మాట్లాడుతూ 150మీటర్లలో ఈ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పల్స్ పోలియో విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సమిష్టి కృషితో పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలో తుండకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్‌రాయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు లోకేష్, సిబ్బంది రమేష్, పంచాయతీ కార్యదర్శి శంకర్, హెచ్‌ఎం ధనంజయరాజు తదితరులు పాల్గొన్నారు.

సోమల: పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శని వారం మండల కేంద్రంలోని విద్యార్థులు, హెచ్ఎం ఎల్లయ్య , వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఓ అమర్నాథ్, కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.

యాదమరి: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ తెలిపారు. శనివారం యదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్, సిహెచ్ఓ లక్ష్మీనారాయణ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాదిరెడ్డిపల్లి ఎంపీహెచ్వో మునీంద్ర రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కృపాలక్ష్మికి అభినందనల వెల్లువ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: జీడీ నెల్లూరు వైసీపీ సమన్వయకర్తగా కృపాలక్ష్మిని నియమించడంతో ఆమె పలువురి అభినందనలు వెల్లువెత్తాయి. అందులో భాగంగా శనివారం వెదురు కుప్పం మండలం పెరుమాళ్లపల్లి ఎంపీటీసీ తోకల మురళీరెడ్డి ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిపించుకొనేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం: ఎమ్మెల్యే



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వికోట: రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేసి ప్రగతి పథంలో నడిపేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పిఎన్ లక్ష్మి, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు తమీం ఖాన్, లక్ష్మణ్ రెడ్డి, నాయకులు బాల గురునాథ్, నాగరాజు, అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: భారత రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు కాణిపాకం శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాణిపాకం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా లేడు బ్యాంకు మేనేజర్ హరీష్ విద్యార్థులకు తెలియజేశారు. కాణిపాకం నందు విద్యార్థులు ఆర్థిక అభివృద్ధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, సురేష్ బాబు, సురేంద్ర బాబు, సతీష్, బాలయ్య, శ్రీలత బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు పరామర్శ



బాబునాయుడును పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని కొత్త వెంకటాపురం గ్రామానికి చెందిన మండల సీనియర్ నాయకులు, సింగిల్ విండో ఉపాధ్యక్షులు బాబు నాయుడును డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొంది, విశ్రాంతి తీసుకుంటుండగా శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, కుట్టి, వెంకటేష్, బాబు పాల్గొన్నారు. అదేవిధంగా వైసీపీ మండల మాజీ ఎంపీపీ ప్రగతి భర్త కరుణాకర్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడగా, విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి శనివారం కరుణాకర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి: ఉపాధి పీడీ



గంగవరంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఉపాధి పీడీ రాజశేఖర్

ప్రజాశక్తి-గంగవరం: ఉపాధిహామీ పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఉపాధి పీడీ రాజశేఖర్ ఆదేశించారు. శనివారం గంగవరం మండలం చౌడిరెడ్డిపల్లి దండపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్టిలో ఉంచుకొని కూలీలకు కావలసినన్ని పనులు గుర్తించాలని ఆదేశించారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మారేడుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన దీర్ఘకాళికా రోజా మొక్కలు పరిశీలించి సంతృప్తి వ్యకం చేశారు. పుంగనూరు ఏపీడీ నీలిమ, ఏపీఓ మురుగేషన్, జేఈ కోదండపాణి, టిఏ వెంకటేశు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోమల: ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా నిర్దేశించిన పనులను మార్చి లోగా పూర్తి చేయాలని సిబ్బందికి ఉపాధి పీడీ రాజశేఖర్ సూచించారు. శనివారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్.నడింపల్లి పంచాయతీలోని పలు ఫారం పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వేసవి కాలంలో ఉపాధి హామీ ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు వారికి నీడ త్రాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దినకర్ బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శంఖారావం సభా స్థల పరిశీలన



ప్రజాశక్తి - చిత్తూరుడెస్క్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం సభ ఈనెల 9న నగరి నియోజకవర్గ స్థాయిలో జరగనున్న నేపథ్యంలో శనివారం నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను స్థల పరిశీలన చేశారు. నగరి మున్సిపాలిటీ దేశమ్మ ఆలయ సమీపంలో సభ స్థలాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభలకు అనుమతులు తప్పనిసరి: డీఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: సబ్‌డివిజన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల దృష్ట్యా ఈ నెల 31వరకు నగరి డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ర్యాలీలు, బహిరంగ సభలు, మైక్‌సెట్లు లాంటివి ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతుల కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



డీఎస్పీ నరసింహమూర్తి

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మండలంలోని నెత్తం కండ్రిగ దళితవాడకు చెందిన రాసాతి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న దుస్తులు, బియ్యం, సామగ్రి, బీరువాలోని డాక్యుమెంట్లు పూర్తిగా కాలిపోయాయి. ఆమె భర్త ఇంతకు ముందే చనిపోయారు. ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆ ఇల్లు దగ్ధమవ్వడంతో ఆ కుటుంబం నిరాశ్రయులైనారు. విషయం తెలుసుకున్న టీడీపీ నగరి అభ్యర్థి గాలి భానుప్రకాష్ వారికి ఆర్థిక సాయం అందజేశారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పుంగనూరు: అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని సింగిరిగుంట గ్రామానికి చెందిన వెంకటేష్, నాగరాజులు ద్విచక్రవాహనంలో మద్యం తరలిస్తుండగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 196టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.